క్లుప్తంగా

ఇంటింటికీ అయోధ్య శ్రీరాముని అక్షింతలు



బేతంచెర్లలో అక్షింతలు పంపిణీ

బేతంచెర్ల: అయోధ్యలో ఈ నెల 22వ తేదీ రామ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు, మందిరం విశేషాలతో కూడి కరపత్రాలు అందజేస్తున్నట్లు హుసేన్ రెడ్డి, బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, గుండా గోపాల్, మారుతి శర్మ తెలిపారు. బేతంచెర్ల పూదోట ఆశ్రమంలో సోమవారం ఇంటింటికీ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న దాతలు

కోవెలకుంట్ల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి కార్మికులకు చీరెలను అందజేశారు. ప్రకృతి పీఠం ద్వారా ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సభ్యులు లింగన్న, సీతారామయ్య, రవితేజారెడ్డి, ఓబులేసు, మల్లికార్జున పాల్గొన్నారు.

చల్లాకు నివాళి



చల్లా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అవుకు: దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా సోమవారం చల్లా కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అవుకు–తాడిపత్రి రహదారిలోని చల్లా ఫామ్‌హౌస్‌లో ఉన్న సమాధి వద్ద ఆయన కుమారుడు, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, అవుకు సొసైటీ చైర్‌పర్సన్ చల్లా విజభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా అమర్‌నాథ్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లా హిమకర్ రెడ్డి, చల్లా ప్రణవ్ నాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, నాయకులు చల్లా చైతన్య రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కార్పెంటర్లు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కార్పెంటర్స్ యూనియన్ కార్యాలయంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అబ్దుల్‌ఫైజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కార్పెంటర్లకు లక్షల విలువైన స్థలాన్ని ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చాంద్‌బాషా, ఉపాధ్యక్షుడు జమీందర్‌వలి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం బైకును ట్రాక్టర్ ఢీకొనడంతో మల్లి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓంకారేశ్వరుడికి ప్రత్యేక పూజలు



మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం ఆలయంలో వెలిసిన శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి వార్లకు సోమవారం ఉదయం విశేషంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేపట్టారు.






డోన్: ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ, మంత్రి బుగ్గనకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్, ఎంపీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటాపురం గ్రామస్తులు, బేతంచెర్ల: ఎంపీపీ బుగ్గన, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి..

నూతన జోష్

- ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు
- కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్న యువత
- నాయకులు, ఉన్నతాధికారులకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- పలు ఉద్యోగ, కార్మిక సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

డోన్: కొత్త ఆశలు, ఆశయాలతో నూతన ఏడాదికి సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. సరికొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కేక్‌లు కట్టి చేసి సంబరాలు చేసుకున్నారు. కుటుంబ సమేతంగా దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గ ప్రజలు పోటెత్తారు. ఉదయాన్నే డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్ మంత్రి గృహంలో ఆయన చేత కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీఓ వెంకటరెడ్డి, డోన్, ప్యాపిలి తహసీల్దార్లు విద్యాసాగర్, చంద్రశేఖర్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. సాయిశ్రీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, మాజీ చైర్మన్ రామచంద్రుడు, జెడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, శివరామిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్‌లు మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి, చంద్రన్న, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, పోస్టుప్రసాద్, కురుకుంద హరి పాల్గొన్నారు.

పాటల క్యాషెట్ ఆవిష్కరణ

బుగ్గనపై అభిమానంతో సుభాన్ అనే యువకుడు రూపొందించిన రాయలసీమకు నీవు వరమంటా బుగ్గన అనే పాటల సీడీని మంత్రి బుగ్గన ఆవిష్కరించారు. ఈ పాటలో దృశ్యాలు ఎడిటింగ్ ఎంతో చక్కగా ఉన్నాయని సుభాన్‌ను అభినందించారు.

బేతంచెర్ల: ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా దేవదాయశాఖ డీఈ ప్రసాద్, మద్దిలేటిస్వామి ఆలయ ఈఓ పాండు రంగా రెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు, నంద్యాల డీఆర్వో పుల్లయ్య, డీసీహెచ్ఓ జఫ్రుల్లా, నంద్యాల డీఈఓ సుధాకర్ రెడ్డి, జిల్లా ఫారెస్టు అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీడీఓ వెంగన్న, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, తదితరులు శుభాకాంక్షలు చెప్పారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి, కౌన్సిలర్స్ మధు, చింతల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. సంజీవనగర్ కాలనీకి చెందిన సాయి కిరణ్ మా నమ్మకం నువ్వే జగన్ అనే గజమాలను క్రేన్ సహాయంతో మంత్రి బుగ్గనకు వేసి సత్కరించారు.



డోన్: మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

నూతన సంబరాలు

కోవెలకుంట్ల: నూతన సంవత్సర వేడుకలను బనగానపల్లె నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన పలువురు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డికి పూలమాలలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ కానాల కామేశ్వరమ్మ, ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మకు ఆయా గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు శుభాకాంక్షలు చెప్పారు. అలాగే స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, రేవనూరు ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, ప్రతాప్, రమేష్‌రెడ్డి, కల్పన, ఏఎస్ఐలు, పోలీసు సిబ్బంది సీఐ రామానుజులును కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలో చిన్నారులు స్నేహితులకు గ్రీటింగ్ కార్డులు, చాక్లెట్లు అందజేశారు. పూలు, పండ్లు, స్వీట్లు, బొకేల దుకాణాలు జనాలతో కిటకిటలాడాయి. సాయిబాబా, పాండురంగస్వామి, ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

–**సంజామల:** మండల కేంద్రంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, నొస్సంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ముక్కమల్లలో కర్నూల్ ఉమ్మడి జిల్లాల ప్రచార జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలారెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, పేరుసోములలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్న బాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డిలకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. మీరాపురంలో యాగంటి ఆలయ చైర్మన్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పీచైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

కొలిమిగుండ్ల: మండలంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సీసీ అశ్వినికుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీచైర్మన్ చేతుల మీదుగా న్యూఇయర్ కేక్ కట్ చేయించారు. కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి తరలిరావడంతో సందడిగా మారింది. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండాలని జెడ్పీచైర్మన్ ఆకాంక్షించారు.

ప్యాపిలి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచే యువకులు కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డిలకు ఎస్టీయూ నాయకులు వెంకట్‌నాయక్, నాగరాజు, చిన్నపరెడ్డి, కిరణ్ కుమార్, మద్దిలేటి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను అందజేశారు. అలాగే తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్డీ బాలకృష్ణుడుకు ఆయా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.






కోవెలకుంట్ల: ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా దంపతులకు సత్కారం, సంజామల: గుండం సూర్య ప్రకాష్ రెడ్డితో ఎంపీడీఓ, కొలిమిగుండ్లలో జెడ్పీచైర్మన్ పాపిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ సీఈఓ, ప్యాపిలి: జెడ్పీటీసీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌కు..

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

బేతంచెర్ల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిమెంట్‌నగర్ గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ వినోద్ కుమార్, మత పెద్దలు డేవిడ్ రాజు, సుధాకర్, స్వాములు, జయాకర్, మేరమ్మ, మరియమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ సంపత్ కుమార్, జోసెఫ్, యాకూబ్, యోబ్, జీవయ్య, నాగరాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. అందరితో ప్రేమ, దయతో మెలగాలని సూచించారు. అనంతరం చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్లలోని యేరుషలేము, సీఎస్ఐ, ఆర్‌సీఏ చర్చిలో భక్తుల తాకిడితో సందడి వాతావరణం నెలకొంది.

ఏసుమార్గం అనుసరణీయం

బనగానపల్లె రూరల్: ఏసు మార్గం అనుసరణీయమని బనగానపల్లె సీఎస్ఐ టౌన్ చర్చి ఫాదర్ రెవరెండ్ అల్బర్ట్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. కొత్త ఏడాదిలో చెడు వ్యసనాలను దూరం చేసుకుని సన్మార్గంలో నడుకోవాలని.. ఇతరులపై కరుణ కలిగి ఉండాలని సూచించారు. బైబిల్ వ్యాఖ్యలను వివరించారు. మనోహర్, మంజులామణి, శాంతకుమారి, ప్రశాంతి, కరుణాకర్, నవీన్ పాల్గొన్నారు.



సిలువను ఊరేగింపుగా తీసుకెళుతున్న క్రైస్తవులు



బనగానపల్లె: ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు

నేటి నుంచి పెంచిన పింఛన్ల పంపిణీ

కోవెలకుంట్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవ్వాతాతలు, వితంతువులకు పింఛన్ మొత్తాన్ని రూ. 3వేలకు పెంచింది. జనవరి నెల నుంచి లబ్ధిదారులకు పెంచిన ఫించన్ మొత్తం అందించేందుకు వారోత్సవాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా స్థానిక వీఆర్, ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా మంగళవారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, లబ్ధిదారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

–**కొలిమిగుండ్ల:** స్థానిక షిర్డీసాయి ఫంక్షన్ హాలులో మంగళవారం సాయంత్రం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 7,263 పింఛన్‌లు ఉండగా కొత్తగా 96 మంజూరైనట్లు చెప్పారు.

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం రాత్రి షెడ్యూల్డ్ క్యాస్ట్ నేషనల్ కమిషన్ మెంబర్ సుభాష్ రామ్‌నాథ్ పార్డి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ప్రధానాలయ రాజగోపురం వద్ద చేరుకున్న ఆయనకు దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



మల్లన్న దర్శనార్థం వస్తున్న ఎస్సీ నేషనల్ కమిషన్ మెంబర్

మాదాసి కురవ సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

డోన్ టౌన్ : మాదాసి (మాదారి కురవ ఎస్సీ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని హాల్లో కురవ సంఘం రాష్ట్ర కోశాధికారి కేసీ మద్దిలేటి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా గంగన్న, బింగి మల్లికార్జున, రంగనాథం, అధ్యక్షుడిగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ప్రధాన కార్యదర్శులుగా మునిస్వామి, శివలింగయ్య, కార్యదర్శులుగా బాలమద్దయ్య, శ్రీను, కోశాధికారిగా పెద్దరాజు, న్యాయ సలహాదారులుగా పకీరప్ప, రవిమోహన్, లక్ష్మన్న, గౌరవ సలహాదారులుగా పరమేష్, మేఘవర్ణుడు, కాశిపతి, పులిశేఖర్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా 16 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను సత్కరించి ప్రమాణస్వీకారం చేయించారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

అప్రమత్తతే ఔషధం

- కుష్టు రోగులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే
- వచ్చే నెల 12వ తేదీ వరకు నిర్వహణ
- 1,611 బృందాలతో జిల్లా వ్యాప్తంగా సర్వే
- రోగుల గుర్తింపు, వ్యాధి నిర్మూలనే లక్ష్యం

నంద్యాల టౌన్: కుష్టు వ్యాధిని నివారించేందుకు అప్రమత్తతే అసలైన ఔషధమని వైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 27 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందు కోసం జిల్లాలో 1,611 బృందాలను సిద్ధం చేశారు. ప్రతి బృందంలో ఒక ఆశా కార్యకర్త, సచివాలయ వలంటీర్లు ఉంటారు. ఇంటింటికీ తిరిగి కుష్టు వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలిస్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని సమీప ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్యులతో పరీక్ష చేయిస్తారు.

వ్యాధి నిర్ధారణ ఇలా..

శరీరంపై ఉండే స్పర్శ లేని మచ్చలు, నాడుల వాపు ఆధారంగా వ్యాధిని నిర్ధారిస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో వైద్యాధికారి, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సంయుక్తంగా వ్యాధిని నిర్ధారిస్తారు. శరీరంపై స్పర్శ లేని మచ్చల ఆధారంగా ఈ వ్యాధిని 2 రకాలుగా విభజిస్తారు. ఇవి పీబీ, ఎంబీగా ఉంటాయి. శరీరంపై ఐదు కన్నా తక్కువ మచ్చలు ఉంటే పీబీ వీటిని ఆరునెలలు మల్టీ డ్రగ్ థెరపీతో చికిత్స చేసి నివారణ చేస్తారు. ఐదు కంటే ఎక్కువ ఉంటే ఎంబీగా నిర్ధారించి 12 నెలలు చికిత్స అందిస్తారు. లక్షణాలు వున్న వారిని సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షిస్తారు. వ్యాధినిర్ధారణ అయితే వారిని మెరుగైన చికిత్స కోసం సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తారు. ఇదే సమయంలో కేసు బయటపడిన చుట్టుపక్కల 300 ఇళ్లల్లో స్క్రీనింగ్ చేస్తారు. కేసు బయటపడిన ఇంట్లోని వారందరికీ కుష్టు లేకపోయినా ముందు జాగ్రత్తగా మందులు ఇస్తారు.

జిల్లాలో ప్రస్తుత పరిస్థితి..

నంద్యాల జిల్లా ఏర్పాటైయినప్పటి నుంచి 2021–22లో 79 కేసులు, 2022–23 లో 136 కేసులు, 2023–24లో ఇప్పటి వరకు 102 కేసులు గుర్తించారు. ఇప్పటి వరకు జిల్లాలో వ్యాధి వల్ల అంగవైకల్యం కలిగిన 530 మంది బాధితులను గుర్తించారు. వీరిలో 212 మందికి ఏడాదికి రెండుసార్లు ఉచితంగా పాదరక్షలు అందిస్తున్నారు. వీరిలో అర్హులైన 212 మందికి పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. అంగవైకల్యం కలిగిన వారికి డీపీఎంఆర్ సేవలు అందిస్తున్నారు. ఆర్‌సీఎస్ చికిత్స చేయించుకున్న వారికి ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం రూ.12 వేలు ఆర్థిక సహాయం చేస్తుంది.



లెప్రసీ సర్వే చేస్తున్న అధికారులు

ప్రాథమిక దశలో గుర్తించాలి



కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఎండీటీ చికిత్స చేయడం వల్ల నరాలు దెబ్బ తినకుండా కాపాడవచ్చు. వ్యాధిపై భయం పోగొట్టి అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చు. కుష్టు వ్యాధి నివారణకు ప్రజలందరి భాగస్వామ్యం అవసరం. పౌష్టికాహారం తీసుకుంటూ, చికిత్స తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చు.

– డాక్టర్ శారదబాయి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి, నంద్యాల

5 నుంచి చౌడేశ్వరి ఆలయంలో చండీయాగం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు చండీయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామానుజన్ సోమవారం తెలిపారు. చౌడేశ్వరి దేవి దీక్ష విరమణ సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొంటున్నారని, భక్తులు అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కొత్తగా 191 పింఛన్లు మంజూరు

బనగానపల్లె: బనగానపల్లె మండలానికి కొత్తగా 191 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 72, వితంతు 97, దివ్యాంగులు 21, ఒంటరి మహిళ పింఛన్ ఒకటి మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలో నూతన సంవత్సరం సందర్భంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు పడిపూజ చేశారు. స్వామివారిని పల్లకీపై కొలువుదీర్చి అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

జోగులాంబ అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

బనగానపల్లె రూరల్: తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాలోని జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ ఆదివారం దర్శించుకున్నారు. 2024 నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.



కాటసాని రామిరెడ్డి దంపతులకు తీర్థం అందజేస్తున్న అర్చకుడు

● కోవెలకుంట్లలో

కొత్త వెలుగులు



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కోవెలకుంట్ల కొత్త కాంతులతో విరాజిల్లుతోంది. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో స్థానిక ముదిగేడు చౌరస్తా నుంచి జమ్మలమడుగు చౌరస్తా వరకు రూ. 8 కోట్లతో 800 మీటర్ల మేర కొత్తగా డివైడర్‌తో కూడిన సీసీరోడ్డు ఏర్పాటు చేశారు. డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ అమర్చారు. 2024 నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించడంతో కొత్త శోభను సంతరించుకుంది. –కోవెలకుంట్ల